గృహప్రవేశ పూజల్లో ప్రభుత్వ చీఫ్ విప్



పూజల్లో డాక్టర్ పట్నం మహేందర్‌రెడ్డి

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీర్తి రిచ్ మండ్ విల్లాలో నూతన గృహ ప్రవేశ పూజల్లో తెలంగాణ రాష్ట్ర చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ ఎస్.గీతారెడ్డి నూతన గృహప్రవేశ శుభ కార్యంలో ఆయన పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టీఎస్ పీఎస్సీ మాజీ చైర్మన్ జనార్దన్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ శ్రీనాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న టీటీ పోటీలు



మైలార్‌దేవ్‌పల్లి: మహవీర్ గ్రూప్ విద్యా సంస్థల ఆధ్వర్యంలో దివంగత సంరెడ్డి సుదర్శన్‌రెడ్డి జ్ఞాపక తెలంగాణ రాష్ట్రస్థాయి 11వ టేబుల్ టెన్నిస్ ర్యాంకింగ్ టోర్నమెంట్స్ విజయవంతంగా కొనసాగుతోందని కళాశాల సెక్రటరీ సంరెడ్డి సురేందర్‌రెడ్డి తెలిపారు. ఈ టోర్నమెంట్‌లో గెలుపొందిన అండర్-11, 13 విభాగాలకు చెందిన బాలబాలికలకు నగదు పారితోషకంతో పాటు బహుమతులు ఈ నెల 4వ తేదీన అందజేయనున్నట్లు తెలిపారు. ముగింపు కార్యక్రమానికి మహబూబ్‌నగర్ టీచర్ ఎమ్మెల్సీ ఎ.వెంకటనారాయణరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారు. టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ నాగేందర్ రెడ్డి, జాయింట్ సెక్రటరీ సంరెడ్డి ధనుంజయ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సందడిగా కావడి యాత్ర

అత్తాపూర్: శ్రావణమాసం సందర్భంగా అత్తాపూర్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఆదివారం కావడి యాత్రను ఘనంగా నిర్వహించారు. రాజస్థాన్ సేవా సమితి ఆధ్వర్యంలో శ్రావణమాసంలో హర హర మహదేవ్ శంభో శంకర అనే నినాదాలతో కుటుంబ సభ్యులతో కలిసి యాత్రలో పాల్గొన్నారు. తేజస్వీనగర్ కాలనీ లక్ష్మీనర్సింహ స్వామి ఆలయం నుంచి చిన్న అనంతగిరి శివాలయం వరకు పాదయాత్రలో వచ్చి శివుడిని దర్శించుకున్నారు. భజన, ఆటపాటలతో కావడి యాత్ర ఆద్యంతం సందడిగా సాగింది. యాత్రలో రాజేంద్ర అగర్వాల్, రామావతార్ గుప్తా, వి.వి.ఎస్.ఆర్.ఆంజనేయులు, అశోక్‌శర్మ, మాలోచంద్ శర్మ, మనీష్ సీత్లావాలా, మనీష్ అగర్వాల్, లాల్‌చంద్ అగర్వాల్, రాజేష్ సాబూ, అశోక్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

రాజేంద్రనగర్ అదనపు డీసీగా సురేందర్‌రెడ్డి



ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌ను కలిసిన సురేందర్‌రెడ్డి

రాజేంద్రనగర్: జీహెచ్ఎంసీ రాజేంద్రనగర్ సర్కిల్ అదనపు ఉప కమిషనర్‌గా బి.సురేందర్ రెడ్డి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డీసీ మాట్లాడుతూ... సర్కిల్ పరిధిలో నెలకొన్న సమస్యల సత్వర పరిష్కారానికి, మెరుగైన వసతుల కల్పనకు, సర్వతోముఖాభివృద్ధికి తన వంతు కృషి చేస్తామని తెలిపారు. సర్కిల్ పరిధిలోని అన్ని విభాగాల అధికారులు, సిబ్బందికి, ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని ఆయన స్పష్టం చేశారు.

నేడు ప్రజావాణి

రాజేంద్రనగర్: జీహెచ్ఎంసీ రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు అదనపు ఉప కమిషనర్ సురేందర్ రెడ్డి తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సర్కిల్ కార్యాలయంలో కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. రాజేంద్రనగర్, మైలార్‌దేవ్‌పల్లి, సులేమాన్‌నగర్, శాస్త్రీపురం, అత్తాపూర్ డివిజన్లకు చెందిన ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యలను లిఖితపూర్వకంగా ప్రజావాణిలో ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. అన్ని శాఖల అధికారులు కార్యక్రమానికి హాజరవుతారన్నారు. ప్రజలు తమ దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను సంబంధిత అధికారులు, సిబ్బంది అక్కడికక్కడే పరిష్కారం కోసం కృషి చేస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

గ్రంథాలయం.. అలంకారప్రాయం!

అందుబాటులో లేని కొత్త పుస్తకాలు

- పోటీ పరీక్షల పత్రికలు పూర్తిగా బంద్
- దినపత్రికల సంఖ్య కుదింపు
- తగ్గిపోతున్న పాఠకుల సంఖ్య
- డిజిటల్ లైబ్రరీ ఊసే లేదు



శంషాబాద్‌లోని గ్రంథాలయ భవనం



పాఠకులు లేక బోసిపోయిన గ్రంథాలయం

శంషాబాద్: గ్రంథాలయ యంత్రాంగం పనిగట్టుకుని మరీ పాఠకులను దూరం చేసుకుంటోంది. ఆధునిక హంగులతో కొత్త భవనం ఏర్పాటు చేసినా చదివేందుకు సరైన పుస్తకాలు లేకపోవడంతో పాఠకుల సంఖ్య గణనీయంగా తగ్గిపోతోంది. గడచిన రెండున్నర సంవత్సరాలుగా లైబ్రరీకి కొత్త పుస్తకాలు ఒక్కటీ రాలేదంటే గ్రంథాలయం పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. ఈ నేపథ్యంలో శంషాబాద్ పట్టణంలో ఉన్న గ్రంథాలయం అలంకార ప్రాయంగా తయారవుతోంది.

ప్రయోజనం ఏది..?

పట్టణంలో పాతగ్రంథాలయ భవనం శిథిలం కావడంతో సుమారు దశాబ్దకాలం గ్రంథాలయం స్కూల్, మినీ స్టేడియం భవనాల్లో కొనసాగింది. రెండేళ్ల కిందట ఆధునిక హంగులతో గ్రంథాలయ భవనాన్ని నిర్మించారు. అందులోకి గ్రంథాలయాన్ని మార్చారు. అన్ని హంగులతో కూడిన భవనం ఏర్పాటు చేసినా దానికి సరైన భద్రత లేకపోవడంతో ఆకతాయిలు కిటికీల ఊచలు తొలగించి విద్యుత్ సామగ్రిని ఎత్తుకెళ్లారు. ఈ విషయాన్ని పరిగణలోకి తీసుకున్న అధికారులు గ్రంథాలయంలో పైన ఉన్న భవనంపై డిజిటల్ లైబ్రరీకి ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనను కాస్తా పక్కన పడేశారు. మొదటి అంతస్తు భవనం ప్రైవేటు వ్యక్తులకు యోగా శిక్షణకు అప్పగించారు.

పుస్తకాలేవీ..?

సుమారు రెండున్నర ఏళ్లుగా గ్రంథాలయానికి కొత్త పుస్తకాల పూర్తిగా రావడం లేదు. వీటికి తోడు పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే విద్యార్థుల కోసం వచ్చే వార, మాస పత్రికలకు కూడా తాజాగా అధికారులు బంద్ చేశారు. తెలుగు, ఆంగ్లం, హిందీ, ఊర్దూలో మొత్తం పదికిపైగా దినపత్రికలు వచ్చే చోట వాటి సంఖ్యను కూడా కేవలం నాలుగుకు కుదించారు. దీంతో తమకు ఇష్టమైన పత్రికలు చదివేందుకు వచ్చే పాఠకులు కూడా గ్రంథాలయం మెట్లు ఎక్కకుండా మానేశారు. లైబ్రరీ సమీపంలో రెండు జిల్లా పరిషత్, ప్రాథమిక పాఠశాలతో పాటు ఇంటర్, డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. అన్నిరకాల పుస్తకాలు అందుబాటులకో తేవడంతో పాటు అన్ని రకాల దినపత్రికలనూ అందుబాటులో ఉంచాలని పాఠకులు డిమాండ్ చేస్తున్నారు.

మదిదోచే చేనేత ప్రదర్శన



మణికొండ: మణికొండ పైప్‌లైన్ రోడ్డులోని సుందర్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన చేనేత వస్త్ర ప్రదర్శన సందర్శకులు ప్రధానంగా మహిళల హృదయాలను ఎంతగానో ఆకట్టుకుంటోంది. దేశ వ్యాప్తంగా చేతి వృత్తుల వారు తయారు చేసిన దుస్తులు, గృహోపకరణ వస్తువులు, కళాకారులు తయారు చేసిన వస్తువులు ఎంతగానో అలరిస్తున్నాయి. మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి, భాగల్‌పూర్, డిజైనర్, కాంతా వర్క్, హ్యాండ్ బ్లాక్ ప్రింటెడ్ లెనిన్, కలంకారి, బెంగాల్ కాటన్ చీరలతో పాటు డ్రస్ మెటీరియల్, డిజైనర్ బ్లౌజ్‌లు, ఖాదీ మెటీరియల్, వన్ గ్రాం గోల్డ్ జ్యువలరీ, జైపూర్ బెడ్‌షీట్స్, కొండపల్లి బొమ్మలు, పర్సులు, గృహోపకరణ వస్తువులను నిర్వాహకులు అందుబాటులో ఉంచారు. పలు రాష్ట్రాల్లోని చేతి వృత్తుల కళాకారులు రూపొందించిన నాణ్యమైన వస్తువులన్నీ ఒకే చోట లభిస్తుండటంతో కొనుగోలు దారులు ఆదరిస్తున్నారని నిర్వాహకుడు అక్బర్ తెలిపారు. పరిసర ప్రాంతాల ప్రజలు ఎగ్జిబిషన్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా నరసింహారెడ్డి



రాజేంద్రనగర్: సీపీఐ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యుడిగా రాజేంద్రనగర్ బుద్వేల్‌కు చెందిన నరసింహారెడ్డి నియమితులయ్యారు. భారత కమ్యూనిస్టు పార్టీ రంగారెడ్డి జిల్లా 17వ మహాసభలో 23 మందితో జిల్లా కార్యవర్గాన్ని నియమించారు. ఇందులో రాజేంద్రనగర్ బుద్వేల్‌కు చెందిన పార్టీ సీనియర్ నాయకుడు నరసింహారెడ్డిని జిల్లా కార్యవర్గ సభ్యునిగా నియమించారు. ఈ సందర్భంగా నరసింహారెడ్డి మాట్లాడుతూ... మొదటిసారిగా జిల్లా కార్యవర్గ సభ్యుడిగా నియమించినందుకు పార్టీ అధిష్టానానికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధి కోసం తన శాయశక్తులా కృషి చేస్తానని వెల్లడించారు.

డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రారంభం



పైపులైన్ పనులను ప్రారంభిస్తున్న అడికే రాజు తదితరులు

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ లక్ష్మీగూడ హౌసింగ్ బోర్డు కాలనీలో డ్రైనేజీ పైపులైన్ నిర్మాణ పనులను ఆదివారం ప్రారంభించారు. లక్ష్మీగూడ హౌసింగ్ బోర్డు కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు అడికే రాజు జలమండలి వాటర్ వర్క్స్ అధికారులతో కలిసి కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సమస్యలపై ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకువెళ్లి అభివృద్ధి పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవడం కుంటామన్నారు. అన్ని శాఖల అధికారులు కాలనీ అభివృద్ధికి సహకరించాలని కోరారు. అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ సకాలంలో పూర్తి అయ్యేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులు సేవాగుణం అలవర్చుకోవాలి



దివ్యాంగులకు భోజనం, నిత్యావసరాలను అందిస్తున్న విద్యార్థులు

మణికొండ: విద్యార్థులు చిన్నప్పటి నుంచే సేవా గుణం అలవర్చుకోవటంతో పాటు సామాజిక బాధ్యతను తీసుకోవాల్సిన అవసరం ఉందని మణికొండ అలకాపూర్ టౌన్‌షిప్‌లోని స్కాలర్స్ ఇంటర్నేషనల్ స్కూల్ చైర్మన్ టి.శ్రీధర్‌రెడ్డి అన్నారు. ఆదివారం సికింద్రాబాద్‌లోని దివ్యాంగుల గృహాన్ని తమ పాఠశాల విద్యార్థులు సందర్శించి వారికి అవసరమైన నిత్యావసరాలను అందించటంతో పాటు వారి జీవిత విధానాన్ని తెలుసుకున్నారన్నారు. ఇలాంటి పర్యటనలతో విద్యార్థులలో సమాజం పట్ల అవగాహన ఏర్పడుతుందన్నారు. ప్రిన్సిపాల్ శిల్పా రెడ్డి, ఉపాధ్యాయులు దుర్గాదేవి, రచన గోస్వామి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆహ్లాదకర వాతావరణం ఉండాలి



పెయింటింగ్ డబ్బాలను హెచ్ఎంకు అందించిన అజయ్‌కుమార్

మణికొండ: పాఠశాలల్లో ఆహ్లాదకర వాతావరణాన్ని కల్పించాలని.. అలాంటప్పుడే విద్యార్థులు ఉత్సాహంగా పాఠశాలకు వచ్చి ఉన్నతంగా చదువుకుంటారని బీఆర్ఎస్ పార్టీ విద్యార్థి విభాగం మణికొండ మున్సిపాలిటీ అధ్యక్షుడు అజయ్‌కుమార్ అన్నారు. మణికొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు పెయింటింగ్ వేయించాలని ప్రధానోపాధ్యాయుడు నిరంజన్ ఆయనకు సూచించారు. దీంతో స్పందించిన అజయ్‌కుమార్ రూ. 65 వేల విలువైన పెయింట్‌లను ఇప్పించి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బీఆర్ఎస్ విద్యార్థి విభాగం తరపున విద్యార్థులకు సౌకర్యాలను కల్పించేందుకు తమ వంతు సహకారం అందిస్తామన్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఇటీవల కొత్త తరగతి గదులు నిర్మించటం, ల్యాబ్‌లను ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. పాఠశాలలో ఉన్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు రాణించాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ ప్రధాన కార్యదర్శి సాయితేజ, ప్రధానోపాధ్యాయుడు నిరంజన్‌లు పాల్గొన్నారు.

నేడు షేక్‌పేట్‌కు మంత్రి వివేక్ రాక

గోల్కొండ: మంత్రి వివేక్ సోమవారం షేక్‌పేట్‌కు రానున్నారని షేక్‌పేట్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు డి.సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రజలు సుఖసంతోషాలతో ఉన్నారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి అన్ని వర్గాల ప్రజల అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. షేక్‌పేట్‌లో పలు అభివృద్ధి పనుల కోసం మంత్రి పర్యటించనున్నారన్నారు.

యువత క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి



గౌలిపురా: గౌలిపురా మిత్రా క్లబ్ ప్లే గ్రౌండ్‌లో ఆదివారం రాష్ట్ర టగ్ ఆఫ్ వార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి సెలక్షన్‌ను నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా రాష్ట్ర టగ్ ఆఫ్ వార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆదర్ల మహేశ్ పాల్గొని రాష్ట్రస్థాయి సెలక్షన్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదర్ల మహేశ్ మాట్లాడుతూ..యువత క్రీడలపై ఆసక్తిని పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టగ్ ఆఫ్ వార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బ్రహ్మానందం, రాష్ట్ర కార్యదర్శి సంతోష్, నల్గొండ సెక్రటరీ నవీన్, కోచ్‌లు రాఘవేంద్ర, బి.సాయి కుమార్, జి.పి.పృథ్వీరాజ్, ఎ.భానుప్రకాశ్, వివిధ జిల్లాల నుండి క్రీడాకారులు పాల్గొన్నారు.

వీధి కుక్కలకు వ్యాక్సినేషన్



వ్యాక్సినేషన్ కార్యక్రమంలో పాల్గొన్న శైలేష్ కుమార్

చాంద్రాయణగుట్ట: వీధి కుక్కలకు ఎప్పటికప్పుడు యాంటీ రెబీస్ వ్యాక్సిన్‌లు వేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి నర్కెట్‌పల్లి శైలేష్ కుమార్ కోరారు. పూల్‌బాగ్ వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం ఏర్పాటు చేసిన యాంటీ రెబీస్ వ్యాక్సిన్ కేంద్రంలో వీధి కుక్కలకు వ్యాక్సినేషన్ చేశారు. శైలేష్ కుమార్ మాట్లాడుతూ..ఇటీవల వీధి కుక్కలు దాడులు చేస్తున్న ఘటనలో ఎంతో మంది చిన్నారులు గాయాలకు గురవుతున్నారన్నారు. ఈ విషయమై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో క్యాంప్ నిర్వహించడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ అధికారులు మహ్మద్ ఫయాజ్, డాక్టర్ అబ్దుల్ వసీ సిద్దిఖీ, శ్రీకాంత్, మహ్మద్ వాసీం, నాయకులు మహేష్ కుమార్, అశోక్, సుధాకర్, రాజేందర్ పాల్గొన్నారు.

వృత్తి పని వారికి గౌరవ భత్యం పంపిణీ



చెక్కును అందజేస్తున్న ఆలయ కార్యనిర్వహణ అధికారిని వసంత

గోల్కొండ: గోల్కొండ బోనాలను విజయవంతంగా నిర్వహించామని ఆలయ కార్యనిర్వహణ అధికారి సి.వసంత అన్నారు. ఆదివారం కోటలోని అమ్మవారి ఆలయ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో అమ్మవారి వృత్తిపని వారికి గౌరవ భత్యం చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బోనాల నిర్వహణకు అన్ని శాఖల అధికారులు తమ తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించారన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కె.చంటిబాబు, నాగేశ్వర్‌రావు, సత్యంరెడ్డి తదితరులున్నారు.

వృత్తిపని వారి మధ్య వాగ్వాదం..

గౌరవ భత్యం చెక్కుల పంపిణీ కార్యక్రమంలో వృత్తిపని వారి మధ్య వాగ్వాదం కాస్తా తోపులాటకు దారి తీసింది. ఆలయ ప్రాంగణంలో కొంత కాలం క్రితం ఏర్పాటు చేసిన వృత్తిపని వారి పేర్ల తొలగింపుపై సంఘం అధ్యక్షుడు టి.శివశంకర్‌తో బి.శ్రీకాంత్‌చారికి వాగ్వాదం చోటు చేసుకుంది. వృత్తిపని వారి పేర్ల తొలగింపుపై శ్రీకాంత్ ప్రశ్నించగా ఈ వాగ్వాదం చోటు చేసుకుంది.

జనావాసాల వద్ద మురుగునీటి శుద్ధి కేంద్రం నిర్మించొద్దు



ఆందోళనలో పాల్గొన్న బీఆర్ఎస్ ఇన్‌చార్జి కార్తీక్‌రెడ్డి తదితరులు

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి గంధంగూడలోని పలు కాలనీల మధ్యలో మురికినీటి శుద్ధి కేంద్ర నిర్మాణాన్ని (ఎస్‌టీపీ) చేపట్టవద్దని.. అందుకు సంబంధించిన పనులను తక్షణమే నిలిపివేయాలని బీఆర్ఎస్ పార్టీ రాజేంద్రనగర్ ఇన్‌చార్జి కార్తీక్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన గంధంగూడలో పర్యటించారు. విగ్నేశ్వర కాలనీ, కేకే ఫేస్-2, దత్తాత్రేయ కాలనీ, బృందావన్ కాలనీ, రంగారెడ్డి కాలనీ వాసులు మురుగు నీటి శుద్ధి కేంద్రం ఏర్పాటుకు వ్యతిరేకంగా చేపట్టిన ర్యాలీ, ధర్నాలో ఆయన పాల్గొని వారికి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా కార్తీక్ రెడ్డి మాట్లాడుతూ... నివాస ప్రాంతాల మధ్య నీటి శుద్ధి కేంద్రం ఏర్పాటు చేయడం వల్ల దుర్వాసనతో పాటు ప్రజారోగ్యానికి ముప్పు ఏర్పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. వాతావరణ, శబ్ద కాలుష్యం తదితర సమస్యలు ఉత్పన్నం అవుతాయన్నారు. శ్వాస కోశ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న వారికి ఇది ప్రమాదకరమని హెచ్చరించారు. మాజీ కార్పొరేటర్ మాలతీనాగరాజు, రవీందర్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ కార్పొరేషన్ అధ్యక్షుడు రావుకోళ్ల నాగరాజు, పలు కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

జాలీగా.. అ'పూర్వ' కలయిక



శంషాబాద్: మూడు దశాబ్దాల క్రితం పదో తరగతి చదువుకున్న అలనాటి స్నేహితులంతా ఫ్రెండ్‌షిప్ డే సందర్భంగా కలిశారు. నాటి స్నేహితులు ఒకే చోట నాటి జ్ఞాపకాలను నెమరువేసుకుని మురిసిపోయారు. శివరాంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1993వ సంవత్సరం పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం స్నేహితుల దినోత్సవాన్ని ఎంజాయ్ చేశారు. ఫ్రెండ్‌షిప్ బ్యాండ్‌లు కట్టుకుని శుభాకాంక్షలు చెప్పుకున్నారు. ఇటీవల ఇందిరాగాంధీ హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడిగా ఎన్నికైన తమ తోటి స్నేహితుడు సంకూరి జయప్రకాశ్‌ను ఘనంగా సన్మానించారు. శారీక వైకల్యంతో బాధపడుతున్న మరో స్నేహితుడు భాస్కరాచారికి ఆర్థికంగా సాయం అందజేసి మేమున్నామంటూ భరోసానిచ్చారు. కార్యక్రమంలో న్యాయవాది ఎస్.వెంకటిరెడ్డి, డాక్టర్ ఎ.కృష్ణ, భాగ్యలక్ష్మి, ఎస్.వరలక్ష్మి, సరిత, రజిత, బి.వరలక్ష్మి, పద్మావతి, ఎస్.కిరణ్, మహ్మద్ ఆసిఫ్, లక్ష్మణ్‌ప్రసాద్, టి.నర్సింహ, చందు, మహేందర్, దాసు, సురేష్, సాయిబాబా, సత్యనారాయణ, యూసుఫ్, నర్సింగ్‌రావు, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

బాలాజీనగర్ ముంపు సమస్యకు చెక్



కాలువలోంచి డ్రమ్ము తీస్తున్న దృశ్యం

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని 18వ వార్డు బాలాజీనగర్ కాలనీలో నెలకొంటున్న ముంపు సమస్య పరిష్కారం అయ్యిందని డీఈ నరేశ్‌కుమార్ అన్నారు. కాలనీలో మురుగునీటి కాలువ సామర్థ్యం పెంచినా నీరు వెనక్కి తన్ని కాలనీ ముంపునకు గురవుతోందన్నారు. దాంతో ఆదివారం కాలనీలోని భూగర్భ డ్రైనేజీలో సిల్ట్ తొలగించే పనులను చేపట్టామన్నారు. దాంతో పైప్ లైన్‌లో డ్రమ్ములు, పెద్ద బండరాళ్లు బయటపడ్డాయన్నారు. అవి ఇప్పటి వరకు నీటిని అడ్డుకున్నాయని, ప్రస్తుతం వాటిని పూర్తిగా తొలగించటంతో ఎంతటి వర్షం పడినా ముంపునకు గురయ్యే అవకాశం ఉండదన్నారు. తమ కాలనీ ముంపు సమస్యను తీర్చేందుకు కృషి చేసిన మున్సిపల్ కమిషనర్ టి. కృష్ణమోహన్‌రెడ్డికి కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు.

గణేశ్ ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తాం



మాట్లాడుతున్న చర్మాణి రూప్‌రాజ్

రాజేంద్రనగర్: గణేశ్ నవరాత్రి ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు భాగ్యనగర్ గణేష్ సంస్కృతి కేంద్ర కమిటీ సభ్యులు చర్మాణి రూప్‌రాజ్ అన్నారు. ఉత్సవ సమితి రాజేంద్రనగర్ నియోజకవర్గ సమావేశాన్ని ఆదివారం బండ్లగూడలోని శారద ధామం సరస్వతి శిశు మందిర్‌లో నిర్వహించారు. సమితి నియోజకవర్గ కన్వీనర్ వై.శ్రీధర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రూప్‌రాజ్ మాట్లాడుతూ... నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో ఏర్పాటు చేయనున్న గణేశ్ మండపాల నిర్వాహకులు, భక్తులకు ప్రభుత్వానికి వారధిలా గణేష్ ఉత్సవ సమితి పని చేస్తుందన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు టి.అంజన్ కుమార్ గౌడ్, చేవెళ్ల పార్లమెంటు కన్వీనర్ ఎస్.మల్లారెడ్డి, రంగారెడ్డి జిల్లా బీజేపీ కార్యదర్శి ఎం.కొమురయ్య, పి.మల్లేష్ యాదవ్, జాయింట్ కన్వీనర్ బి.మహాలింగం గౌడ్, అసెంబ్లీ జాయింట్ కన్వీనర్ బాల్‌రెడ్డి, రాజ్‌పాల్ రెడ్డి, విజయ్ కుమార్, వెంకటేశ్, బాబురావు, బాలకృష్ణ, వేణుగోపాల్, నాగేశ్, రాజశేఖర్ రెడ్డి, వై.ఎస్.జగన్ తదితరులు పాల్గొన్నారు.

రూ. 1.59 కోట్లతో సీసీ రోడ్డు నిర్మాణం

పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ

చందానగర్: హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని మంజీరా రోడ్డు నూతన రోడ్డు రూ.1.59 కోట్లతో మైహోమ్ జ్యువెల్ వెనక గేట్ నుంచి హుడా కేఫ్ వద్ద ఉన్న కేకేఎస్ బేకర్స్ వరకు చేపడుతామని పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ అన్నారు. ఆదివారం కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి ఆయన మంజీరా రోడ్డు నూతన రోడ్డు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంజీరా రోడ్డు సమస్యకు నేటితో పరిష్కారం అవుతుందన్నారు. పాత పైప్‌లైన్ స్థానంలో నూతన పైప్‌లైన్ నిర్మించామని, సుమారు 7 కిలో మీటర్ల పైప్‌లైన్ మార్చామని తెలిపారు. ప్రజల సౌకర్యార్థం నూతనంగా సీసీ రోడ్డు నిర్మిస్తున్నామన్నారు. మంజీర రోడ్డు పనులు త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. సంక్షేమ, అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. నాణ్యత విషయంలో ఎక్కడ రాజీ పడకూడదని, ప్రజలకు ట్రాఫిక్ రహిత, మెరుగైన రవాణా సౌకర్యం కొరకు శాయశక్తుల కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, రఘునాథ్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు, మహిళలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

'తెలంగాణలో బాక్సింగ్‌కు ఆదరణ పెరుగుతోంది'



గోల్కొండ: తెలంగాణలో బాక్సింగ్‌కు ఆదరణ పెరుగుతుందని తెలంగాణ రాష్ట్ర బాక్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి పి.రవీందర్ అన్నారు. జాతీయ సబ్ జూనియర్ బాక్సింగ్ పోటీలకు ఎంపికైన వారికి ఆదివారం షేక్‌పేట్‌లోని ఇందిరాగాంధీ స్టేడియంలో క్రీడాకారులకు ట్రాక్ షూస్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత నెలలో షేక్‌పేట్‌లో రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ సెలక్షన్స్ పోటీలు జరిగాయని, వివిధ విభాగాల్లో బంగారు పతకాలు సాధించిన 30 మందిని జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేయడం జరిగిందన్నారు. సబ్ జూనియర్ జాతీయ స్థాయికి ఎంపికైన వారికి కీ స్టోన్స్ స్కూల్ కరస్పాండెంట్ రాంరెడ్డి స్పాన్సర్‌గా వ్యవహరిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ బాక్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి వినేష్‌బాబు, ప్రముఖ బాక్సర్ నిఖత్ జరీన్ తండ్రి జమీల్ అహ్మద్, శివకుమార్ తదితరులున్నారు.